క్లుప్తంగా

రాజగోపుర నిర్మాణానికి విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: మండలంలోని ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి ఆదివారం ఓ భక్తుడు రూ.50 వేలు విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు పట్టణ వాస్తవ్యులు కొండ విట్టోబ కుటుంబ సభ్యులు ఆలయ కార్యాలయంలో విరాళం మొత్తాన్ని అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థప్రసాదాలు, స్వామి వారి శేషవస్త్రం, బాండు అందజేశారు.

అన్నదాన పథకానికి విరాళం

ఉరుకుంద ఈరన్న స్వామి క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఆదివారం ఓ భక్తుడు రూ.50వేలు విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. ఆదోనికి చెందిన తల్లం శివరామకృష్ణయ్య కుటుంబ సభ్యులు రూ.50వేలను ఆలయ కార్యాలయంలో అందజేయగా వారికి ఆలయ అధికారులు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు, బాండు అందజేశారు.

కొనసాగుతున్న భక్తుల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

కోసిగి: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి దర్శనార్థం కోసిగి మీదుగా కన్నిడిగులు చేపట్టిన పాదయాత్ర కొనసాగుతోంది. రేయింబవళ్లు కర్ణాటక రాష్ట్రం నుంచి తరలివస్తున్నారు. వారి రాకతో మండలంలోని వివిధ గ్రామాలు శివనామస్మరణంతో మారుమోగుతున్నాయి. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దారి పొడువున తాగునీరు, భోజన, సేద తీర్చుకునేందుకు వసతులు ప్రతి గ్రామంలో ఏర్పాటు చేశారు.

ఆర్థిక సాయం

కోసిగి: మండలంలోని అగసనూరు గ్రామానికి చెందిన బారిక లక్ష్మన్నకు గుండె ఆపరేషన్ నిమిత్తం అదే గ్రామానికి చెందిన జనచైతన్య అసోసియేషన్ సభ్యులు, స్నేహితులు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం కర్నూలులోని నోబుల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మన్నను పామన్న, అంజిరెడ్డి, తిమ్మప్ప, నాగరాజు, మల్లికార్జున, శరత్ మహాదేవా, యల్లలింగ, గురు కలిసి పరామర్శించి ఆ మొత్తాన్ని అందజేశారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లాలని వైద్యులు సూచించారని, ఆర్థిక స్థోమత లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకొని స్నేహితులు విరాళాలు వేసుకొని ఆ సొమ్ము అందజేశారు. దీంతో లక్ష్మన్న వారికి కృతజ్ఞతలు తెలిపాడు.

ఘనంగా లక్ష్మీమాధవుడి పల్లకీసేవ



శ్రీలక్ష్మీ మాధవులకు పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో శ్రీలక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి అమ్మవార్లకు పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ పండితులు ముందుగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత పూలతో అలంకరించిన పల్లకీపై ఆశీనులను చేసి మేళతాళాల మధ్య గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని భక్తులు తిలకించి పరవశించారు.

22 నుంచి మహిళా కబడ్డీ పోటీలు

పత్తికొండటౌన్: తుగ్గలి మండలం కడమకుంట్ల గ్రామంలో ఈనెల 22వ తేదీ నుంచి జాతీయస్థాయి మహిళల కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఊటకంటి అమర్‌నాథ్‌రెడ్డి, రాతన ఉమామహేశ్వర రెడ్డి, మండల వైస్ ఎంపీపీ ఎద్దులదొడ్డి మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఆదివారం కబడ్డీ పోటీల కరపత్రాలను పత్తికొండలో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కబడ్డీ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ చైర్మన్, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పోటీలను ప్రారంభిస్తారని చెప్పారు. విజేత జట్లకు మొదటి బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ..40 వేలు చొప్పున అందజేస్తామని పేర్కొన్నారు. పోటీల పూర్తి వివరాలకు సెల్ 77802 48219, 99660 65752 నంబర్లను సంప్రదించాలని వారు సూచించారు.

సర్కారు బడుల్లో సీబీఎస్‌ఈ పాఠాలు

- వచ్చే ఏడాది నుంచి అమలు చేయాలని ప్రభుత్వ నిర్ణయం
- ఆదోని డివిజన్‌లో 30 పాఠశాలల ఎంపిక
- గ్రామీణ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించేందుకు అవకాశం

గ్రామీణ ప్రాంత విద్యార్థులు దేశస్థాయి పోటీ పరీల్లో ఉత్తీర్ణులవ్వాలన్నా, మంచి విద్యాసంస్థల్లో సీట్లు సాధించాలంటే సీబీఎస్‌ఈ (సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్) సిలబస్‌పై పట్టుండాలి. ఇందుకు ప్రత్యేకంగా సిద్ధమైనా ఆయా పరీక్షల్లో రాణించడం కష్టం. సాధారణ తరగతుల్లో అదే సిలబస్‌తో చదివితే పాఠ్యాంశాలపై పట్టు చిక్కుతుంది. దీంతో ర్యాంకుల సాధన సులభమవుతుంది. దీన్ని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆ సిలబస్‌ను సర్కారు బడుల్లో అమలు చేయాలని నిర్ణయించింది. ఇందుకు మొదటి విడతగా కొన్ని పాఠశాలలను సైతం ఎంపిక చేసింది. ఇప్పటికే ఎంపికైన పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చింది.

ఆదోని అర్బన్ : వైద్య విద్యను అభ్యసించాలంటే దేశవ్యాప్తంగా జరిగే పోటీ పరీక్షల్లో నెగ్గుకు రావాలి. ఐఐటీ, ఎన్ఐటీ వంటి ఇంజినీరింగ్ విద్యాసంస్థల్లో కోర్సులు చదవడానికి పోటీ పరీక్షల్లో సత్తా చాటాలి. సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) విద్యను అభ్యసిస్తే పోటీ పరీక్షల్లో సులభంగా రాణిస్తారనేది తెలిసిందే. అందుకే తల్లిదండ్రులు ప్రస్తుతం ఆ సిలబస్ అమలు చేస్తున్న పాఠశాలలో తమ పిల్లలను చేర్పేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ సిలబస్‌ను పేదల పిల్లలకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం నడుంబిగించింది. ఇందుకు మొదటి విడతలో భాగంగా పాఠశాలలను ఎంపిక చేసింది.

గ్రామీణ విద్యార్థులు రాణించేలా..

ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులు కూడా జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించాలనేది ప్రభుత్వ లక్ష్యం. కొద్ది రోజుల క్రితమే ఆన్‌లైన్ పాఠాలు వినేందుకు ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేసింది. అలాగే సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేయాలని కార్యాచరణ రూపొందించింది. అందుకు తగ్గట్టుగా ఉపాధ్యాయులకు శిక్షణను కూడా పూర్తి చేసింది. వచ్చే విద్యా సంవత్సరంలో 9వ తరగతి విద్యార్థులను సెంట్రల్ బోర్డులో రిజిస్ట్రేషన్ చేయించనుంది. ఇందుకోసం ఆదోని డివిజన్ పరిధిలో మొదటి ప్రాధాన్యతగా 30 పాఠశాలలను ఎంపిక చేశారు.



ఆదోనిలో మున్సిపల్ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

30 పాఠశాలల్లో అమలు

సీబీఎస్‌ఈ విధానం ఇప్పటివరకు జిల్లా కేంద్రాల్లోని కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల్లో మాత్రమే అందుబాటులో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 2023–24 విద్యా సంవత్సరం నుంచి ఆదోని డివిజన్‌లో 30 ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు సీబీఎస్‌ఈ సిలబస్‌కు మారనున్నాయి.

- ఆదోని మండలంలో ఆరు పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇందులో ఆరేకల్‌లోని ఏపీఎస్ డబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాల, ఆదోని కేజీబీవీ మైనార్టీ , కేజీబీవీ పాఠశాల, ఆరేకల్‌లోని బీసీ వెల్ఫేర్ పాఠశాల, పెద్దతుంబళంలోని జెడ్పీహెచ్ఎస్, దొడ్డనగేరిలోని జెడ్పీహెచ్ఎస్, పెద్దహరివాణంలోని జెడ్పీహెచ్ఎస్, ఆదోనిలోని ప్రభుత్వ బాలికల పాఠశాల ఎంపికయ్యాయి.
- ఆలూరు మండలంలో ఆరు పాఠశాలలు ఎంపికయ్యాయి. అందులో ఆలూరు ఏపీ మోడల్ స్కూల్, అరికెర ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, ఆలూరులోని కేజీబీవీ, ఆలూరు ప్రభుత్వ ఎస్టీ ఉన్నత పాఠశాల, ఆలూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల–01, మొలగవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఎంపికయ్యాయి.
- ఆస్పరి మండలంలో మూడు పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇందులో ఆస్పరి మోడల్ స్కూల్, ఆస్పరి కేజీబీవీ, ఆస్పరి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలున్నాయి.
- చిప్పగిరిలోని కేజీబీవీ, హాలహర్వి మండల కేంద్రంలోని కేజీబీవీ, హొళగుంద మండలంలోని హెబ్బటం జెడ్పీహెచ్ఎస్, హొళగుంద జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలు ఎంపికయ్యాయి.
- కోసిగి మండలంలోని మూడు పాఠశాలలు ఎంపిక కాగా, వాటిల్లో కోసిగి మోడల్ స్కూల్, కోసిగిలోని కేజీబీవీ, కోసిగి జెడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాలు ఉన్నాయి.
- కౌతాళం మండలంలో ఆరు పాఠశాలలు ఎంపికయ్యాయి. అందులో కౌతాళం కేజీబీవీ, ఎరిగేరి జెడ్పీహెచ్ఎస్, బదినేహాల్ జెడ్పీహెచ్ఎస్, హాల్వి జెడ్పీహెచ్ఎస్, కౌతాళం జెడ్పీహెచ్ఎస్, కామవరం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలు ఉన్నాయి.

అత్యాధునిక పద్ధతిలో బోధన..

- సీబీఎస్‌ఈ సిలబస్ అమలులో ఉన్న పాఠశాలల్లో బోధన అత్యాధునికంగా, విద్యాలయాల పర్యవేక్షణ సీబీఎస్‌ఈ బోర్డు పరిధిలో ఉంటుంది.
- ఆధునిక ల్యాబ్‌లు, లైబ్రరీ అందుబాటులోకి రానున్నాయి. డిజిటల్ బోధన కొనసాగుతుంది.
- 9వ తరగతి నుంచి విద్యార్థులను జాతీయస్థాయి పరీక్షలైన జేఈఈ, నీట్ లాంటి పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తారు.
- విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను పెంచేలా సిలబస్ ఉంటుంది.
- ప్రతి తరగతికి నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉండడం ప్రత్యేకత.
- గత డిసెంబర్‌లో స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో సీబీఎస్‌ఈ సిలబస్‌పై 30 పాఠశాలల నుంచి ఒక ప్రధానోపాధ్యాయుడు, మొదటి దశలో స్కూల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. మొత్తంగా 60 మందికి రీసోర్స్ పర్సన్లు శిక్షణ ఇచ్చారు. మిగిలిన వారికి కూడా త్వరలో శిక్షణ ఇవ్వనున్నారు.

పేద విద్యార్థులకు వరం



అసిస్టెంట్ గణేకల్ పాఠశాల సీబీఎస్‌ఈ బోధన పేద విద్యార్థులకు వరం. ఇప్పటివరకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో మాత్రమే ఉన్న సిలబస్‌ను రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మారుమూల పల్లెకు కూడా చేరుతోంది. దేశవ్యాప్తంగా జరిగే పోటీ పరీక్షల్లో మన విద్యార్థులు సత్తా చాటే అవకాశం ఉంది.

– మల్లికార్జున, స్కూల్ అసిస్టెంట్

30 పాఠశాలలు ఎంపికయ్యాయి



సీబీఎస్‌ఈ బోధనకు ఆదోని డివిజన్‌లో 30 పాఠశాలలను ఎంపిక చేశారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ సిలబస్ బోధించేలా కార్యాచరణ ప్రారంభించారు. 30 పాఠశాలల నుంచి ఒక ప్రధానోపాధ్యాయుడు, స్కూల్ అసిస్టెంట్లకు సీబీఎస్‌ఈపై 60 మంది శిక్షణ ఇచ్చాం . త్వరలో మిగిలిన వారికి కూడా శిక్షణ ఇస్తాం. సీబీఎస్‌ఈ బోధనతో దేశస్థాయిలో మన విద్యార్థులు రాణించేందుకు అవకాశాలు మెరుగ్గా పడతాయి.

– శివరాములు, ఎంఈఓ

వైఎస్సార్‌సీపీ.. ప్రజలకు అండగా ఉండే పార్టీ



పెద్దకడబూరులో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రదీప్ రెడ్డి.



కౌతాళంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దకడబూరు : వైఎస్సార్‌సీపీ అంటే ప్రజలకు అండగా ఉండే పార్టీ అని ఆ పార్టీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ 12 వసంతాలు పూర్తి చేసుకొని 13వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని పంచాయతీల్లో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వై.ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలు, కులమతాలకు అతీతంగా పేదలందరికీ అండగా నిలిచిన ఏకైక పార్టీ తమదేనన్నారు. నవరత్నాల పథకాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమిస్తున్న వ్యక్తి మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీవిద్య, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, ఉప సర్పంచ్ విజయేంద్రరెడ్డి, మాజీ ఎంపీపీ రఘురాముడు, నాయకులు రవిచంద్రరెడ్డి, శివారెడ్డి, నవీన్‌రెడ్డి, జాము మూకన్న పాల్గొన్నారు.

కౌతాళం: మండలంలో వైఎస్సార్‌సీపీ 13 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, యువజన నాయకుడు సుబ్బారాజు మాట్లాడుతూ పార్టీ అధికారం చేపట్టిన నాల్గు సంవత్సరాలలో ఇచ్చిన హామీల్లో 97 శాతం నెరవేర్చిన పార్టీ వైఎస్సార్సీపీ మాత్రమేనని కొనియాడారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సర్పంచ్ పాల్‌దినకర్, వైఎస్ ఎంపీపీ బుజ్జిస్వామి, మాజీ ఎంపీటీసీ, సర్పంచ్ చౌదరి బసవ, అవతారం, ఉరుకుంద ఆలయ కమిటీ డైరెక్టర్ వెంకోబ, పొదలకుంట ఎంపీటీసీ మూకన్న, నాయకులు రాఘవేంద్రరెడ్డి, అబ్దుల్‌సమద్, వులగయ్య, మల్లయ్య, ఉమపతి, ప్రహ్లాదరెడ్డి పాల్గొన్నారు.

బడుగు, బలహీనవర్గాలకు అండగా వైఎస్సార్‌సీపీ



మాట్లాడుతున్న మనోజ్‌కుమార్ రెడ్డి

ఆదోని టౌన్ : బడుగు, బలహీనవర్గాలకు అండగా నిలిచిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీనే నని ఎమ్మెల్యే తనయుడు, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను వర్తింపజేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగనన్న పాలన సాగించి దేశానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ 12 ఏళ్ల పూర్తి చేసుకుని 13వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా సంబరాలు జరుపుకున్నారు. ముందుగా వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేకు కట్ చేసి కార్యకర్తలు, నాయకులకు పంచిపెట్టారు. పార్టీ కార్యాలయం ముందు బాణసంచా పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆశలు, ఆశయాలను నెరవేర్చడానికి పుట్టిన పార్టీ అని, మరో 20 ఏళ్ల అధికారంలో ఉండటం ఖాయమని, ఇందుకు ప్రజల నమ్మకమేనని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు దేవా, పట్టణ కన్వీనర్ మధుసూదన్‌శర్మ, నాయకురాళ్లు జిలేకాబీ, శోభాలత, శ్రీదేవి, నాయకులు సన్నీ, సింహం నాగేంద్ర, తిమ్మప్ప, దస్తగిరినాయుడు, బాబు, గంగాధర్, సురేష్, రామకృష్ణ, ఈరన్న, తాయన్న, లక్ష్మీనారాయణ, బాలాజీ, వెంకటేశులు, ఇంతియాజ్, ఫయాజ్, నభి, మల్లి, చిన్న ఈరన్న పాల్గొన్నారు.

వైభవంగా వసంతోత్సవం



ఉత్సవమూర్తులకు వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మద్దికెర : పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ రంగనాథస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం అర్చకులు రంగస్వామి ఆధ్వర్యంలో పూర్ణాహుతి, పల్లకీ సేవ, వసంతోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీరంగనాథ స్వామిని పల్లకీలో కొలువుంచి ఊరేగింపుగా వెళ్లి స్థానిక స్వామి వారి బావి వద్ద వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యువకులు రంగులు చల్లుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీవారు హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి హంస వాహనంపై కొలువుంచారు. ఆలయ ఆవరణలో పల్లకీ సేవ చేశారు. అనంతరం గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ మల్లికార్జున గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు

హొళగుంద: మండల పరిధిలోని దేవరగట్టులో వెలిసిన మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఆదివారం స్వామివారం కావడంతో స్థానికులే గాకుండ కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా పూజారులు మూల విరాట్‌లకు సుప్రభాతసేవ, బండరార్చన, కుంకుమార్చన, అభిషేకాలు, మహామంగళారతి, నైవేద్య సమర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆస్పరి మఠంలో అన్నదానం చేపట్టారు.

20న మార్కెట్ల వేలాలు

ఆదోని టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని ఝాన్సీ లక్ష్మీభాయి కూరగాయల మార్కెట్, పశువుల సంత, గొర్రెల, మేకల, పశువుల కమేళాలకు సంబంధించి ఈనెల 20వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలాలు నిర్వహిస్తామని వేయనున్నట్లు కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆసక్తిగల కాంట్రాక్టర్‌లు మున్సిపల్ నిబంధనల మేరకు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

నూతన కమిటీ ఎన్నిక

ఆదోని అర్బన్ : మండగిరి మున్సిపల్ కాలనీలో వెలిసిన శ్రీ మాతా పరమేశ్వరి ఆలయ నూతన కమిటీని ఆదివారం సాయంత్రం కులపెద్దలు, యువకుల సమక్షంలో ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా డి.సుబ్బన్న, అధ్యక్షుడు జి.రంగస్వామి, ఉపాధ్యక్షుడు యు.చంద్రయ్య, జనర్ సెక్రటరీ దండోరా కొండయ్య, జాయింట్ సెక్రటరీ జి.రామకృష్ణ, ట్రెజరర్ అంపాల వెంకటేశులు, జాయింట్ ట్రెజరర్స్ జి.రామయ్య, లవకుమార్, మాధవ్, మురళీ, చీఫ్ అడ్వైజర్స్ హరినాథ్, వాసు, కుమార్, మస్తాన్, బాలాజీ, టీసీ వెంకటస్వామి తదితరులను ఎనుకున్నారు.

ఓటుకు వేళాయె..

- శాసనమండలి ఎన్నికలకు సర్వం సిద్ధం
- నియోజకవర్గంలో 8 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు
- 70 మంది టీచర్లు, 2,783 మంది పట్టభద్రులు
- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

మంత్రాలయం : ఆరేళ్లకోసారి జరిగే శాసన మండలి ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు ఓటు హక్కు వినియోగించుకునే వేళ. మేధావులంతా కలిసి ఎమ్మెల్సీ అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చే రోజు. ఉనికి కోసం టీడీపీ, వామపక్షాలు తంటాలు పడుతుండగా.. వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా తమ తమ మద్దతుదారుల గెలుపు కోసం శ్రమిస్తున్నాయి. పోటాపోటీ ప్రచారం కానిచ్చి ఓటరు మహాశయులను ప్రాధేయపడ్డాయి. సోమవారం జరిగే ఓటింగ్‌కు యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది.

మండలం	పోలింగ్ కేంద్రం నంబర్	టీచర్లు	పట్టభద్రులు
మంత్రాలయం	130	26	--
	253	--	643
కోసిగి	127	27	--
	250	--	807
పెద్దకడబూరు	133	08	--
	257	--	589
కౌతాళం	128	09	--
	251	--	744

ఎనిమిది పోలింగ్ కేంద్రాల ఏర్పాటు..

నియోజకవర్గంలో మొత్తం ఎనిమిది పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పట్టభద్రులు, టీచర్ల కోసం వేర్వేరుగా బూత్‌లు సిద్ధం చేశారు. కేంద్రాల్లో బ్రాడ్ కాస్టింగ్ ఏర్పాటు చేసి పక్కా నిఘా మధ్య ఎన్నికలు జరుపనున్నారు. మంత్రాలయంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బూత్‌లు 130, 253), కోసిగిలోని పరమేశప్ప జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల (బూత్‌లు 127, 250), పెద్దకడబూరులో జెడ్పీహెచ్ స్కూలు (బూత్‌లు 133, 257) కౌతాళంలోని జెడ్పీహెచ్ స్కూలు (బూత్‌లు 128, 251)లో ఏర్పాటు చేశారు. ఇక నియోజకవర్గంలోని 94 స్థానాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, నలుగురు జెడ్పీటీసీ సభ్యులు ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

పటిష్ట బందోబస్తు ..

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఒక్కో కేంద్రంలో సీఐ, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు 3, మహిళా కానిస్టేబుల్, మహిళా పోలీసులు ఐదుగురు ఉంటారు. సమస్యాత్మక కేంద్రాల్లో కానిస్టేబుళ్లు, ఏఎస్ఐల సంఖ్య పెంచారు. ప్రశాంతంగా ఓటింగ్ జరిగేలా డీఎస్పీ వినోద్‌కుమార్ నేతృత్వంలో సీఐ, ఎస్ఐలకు విధులు నిర్వర్తించనున్నారు.

ఓటింగ్ శాతం పెరిగే అవకాశం..

గతంతో పోలిస్తే ఈ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉందని పరిశీలకులు పేర్కొంటున్నారు. పట్టభద్రుల్లో అవగాహన పెరగడమే కారణమంటున్నారు. అలాగే మద్దతుగా నిలిచిన పార్టీ నేతలు ఓటర్లు ఓటు వినియోగించుకునేలా ప్రోత్సహించడం కూడా ఓ కారణంగా చెబుతున్నారు.పోటీలో అత్యధికంగా అభ్యర్థులు ఉండటంతో సాధారణంగా ఓటింగ్ పెరిగే అవకాశముంటుందంటున్నారు.



కోసిగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు



ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకున్నాం. ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశాం. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. అవాంఛనీయ సంఘటనలు తావులేకుండా బందోబస్తు చేపట్టాం. రెండు బూత్‌లలో పోలీసు పహారా ఉంటుంది.

– శ్రీనివాసులు, సీఐ, మంత్రాలయం

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు



డీఎస్పీ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులకు విధులు కేటాయిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్ : ఆదోని డివిజన్‌లోని 9 మండలాల్లో సోమవారం జరగనున్న గ్రాడ్యుయేట్స్, టీచర్స్, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో పోలీసులకు విధులు కేటాయించారు. డీఎస్పీ మాట్లాడుతూ ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. విధుల్లో డివిజన్‌లో ఒక ఏఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 11 మంది సీఐలు, 24 మంది ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు 73 మంది, కానిస్టేబుళ్లు 173 మంది, మహిళా కానిస్టేబుళ్లు 10 మంది, ఏఆర్ కానిస్టేబుళ్లు 40 మంది, హోంగార్డులు 36 మంది ఉంటారని, మొత్తం 367 మంది పోలీసు సిబ్బందితో ఎన్నికలకు బందోబస్తు కల్పిస్తున్నామని వివరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్ : ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సిబ్బందికి ఎన్నికల విధులు కేటాయించడం, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి అందజేయడం, వారిని పోలింగ్ కేంద్రాలకు తరలించడం తదితర కార్యక్రమాలు సోమవారం స్థానిక సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పోలింగ్ పూర్తయిన తరువాత బ్యాలెట్ బాక్సులను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. డిప్యూటీ కలెక్టర్ రమణాకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా పూర్తి చేయండి..

డివిజన్‌లో సోమవారం జరిగే ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. ఆదివారం పట్టణంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో ఎన్నికల విధులు నిర్వహించే పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. డివిజన్ వ్యాప్తంగా ఎన్నికల నిర్వహణలో మొత్తం 28 మంది పీఓలు, 28 మంది ఏపీఓలు, 58 మంది ఓపీఓలు, 28 మంది మైక్రో అబ్జర్వర్లు, ఆరుగురు జోనల్ ఆఫీసర్లు, ఆరుగురు రూట్ ఆఫీసర్లు, 29 వెబ్‌కాస్టింగ్ సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రమణకాంత్‌రెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాలెట్ బాక్సు తీసుకెళ్తున్న సిబ్బంది



సిబ్బందిని, పోలింగ్ సామగ్రిని తరలించేందుకు సిద్ధంగానున్న ఆర్టీసీ బస్సులు